

# హెల్దీఫుడ్ స్టార్టప్స్

**ఫుడ్‌ప్రెన్యూర్స్ చాలామందే ఉన్నారు. నార్త్, సౌత్ తేడా లేకుండా నోరూరించే రుచులను అందిస్తున్నారు. ఇప్పుడు హెల్దీఫుడ్‌ప్రెన్యూర్స్ వంతు. 'మీల్ సబ్‌స్క్రిప్షన్ సర్వీసెస్'ను వైవిధ్యమైన వ్యాపారంగా, సృజనాత్మకమైన వ్యాపకంగా చేపడుతున్నారు. కస్టమర్ అభిరుచికి పెద్దపీట వేస్తున్నారు. అతని ఆరోగ్య లక్షణాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. అంతిమంగా, తమ బ్యాలెన్స్ షీట్ కూడా ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు.**

## పారాఫిట్

ఇదో ఆరోగ్య రుచుల ప్రపంచం. మీ లక్ష్యం ఏమిటి? బరువు తగ్గడమా, బరువు పెరగడమా, కండరాల సత్తువ పెంచుకోవడమా, డిటాక్స్ కావడమా? ఇవేవీ కాకపోతే.. ఇంకేదైనా తీర్మానమా? మీ మనసులోని మాట పారాఫిట్‌కు చెబితే చాలు. దాదాపు రెండువందల యాభై రకాల రుచుల లోంచి మీకు అవసరమైన వంటకాల్ని సిద్ధం చేస్తారు. వ్యవస్థాపకుడు పరాజ్ ప్రిమ్లానీ.. టీనేజ్‌లో ఊబకాయంతో ఇబ్బందిపడ్డాడు. అవమానాలు ఎదుర్కొన్నాడు. ఏదో ఓ పరిష్కారం కనుగొని తనలాంటి ఎంతోమందికి దారి చూపాలని అనుకున్నాడు. 'పారాఫిట్' ద్వారా తన కలను నిజం చేసుకున్నాడు. ఇప్పటికే పదివేలమంది కస్టమర్లకు సేవలు అందించాడు. ప్రస్తుతం ఢిల్లీకే పరిమితమైనా దేశమంతా విస్తరించే ఆలోచన ఉంది.

## ఫుడ్ డార్జీ

ముంబై కేంద్రంగా పనిచేస్తున్నది. దేశవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించింది. సిద్ధాంత్ భార్గవ వ్యవస్థాపకుడు. తన క్యాంపస్ మిత్రులతో కలిసి స్థాపించాడు. తను స్వతహాగా న్యూట్రిషన్ సైంటిస్ట్. 'మా దగ్గర కొలతలంటే కొలతలే. ఒక్క గ్రాము తేడా వచ్చినా మా న్యూట్రిషనిస్టులు ఒప్పుకోరు' అని సగర్వంగా ప్రకటిస్తాడు సిద్దూ. కీటో డైట్‌ను అనుసరించేవారి కోసం ప్రత్యేకమైన మెనూ ఉంటుంది. ఏ వంటకమైనా నెల రోజుల్లో.. రెండోసారి రాకుండా జాగ్రత్త పడుతుంది ఫుడ్ డార్జీ. ఈ సంస్థ వీడియోలకు లక్షలకొద్దీ క్లిక్స్ పడతాయి. ఫుడ్ ఇవ్వడంతో సరిపెట్టుకోకుండా వర్కవుట్ ప్రణాళిక కూడా సూచిస్తారు.

## న్యూట్రి నైన్‌వన్

డైటింగ్‌లో ఉండటం అంటే పొట్టకట్టేసుకోవడం అనే అపప్రదను తొలగించడమే తమ లక్ష్యమని చెబుతారు న్యూట్రి నైన్‌వన్ వ్యవస్థాపకులు. ఇక్కడ దేశీ రుచులే కాదు.. మెక్సికన్, థాయ్, చైనీస్ రుచులూ సిద్ధంగా ఉంటాయి. అన్నీ మన ఆరోగ్య లక్ష్యానికి సహకరించేవే.

## ఈట్‌ఫిట్

హైదరాబాద్ సహా పన్నెండు నగరాలలో సేవలు అందిస్తున్నది. సబ్‌స్క్రిప్షన్‌తో పన్లేకుండా తినాలనిపించిన ప్రతిసారీ హెల్దీఫుడ్ ఆర్డర్ చేయవచ్చు. గ్రిల్డ్ కాటేజ్ చీజ్, క్వినోవా సలాడ్, గ్రిల్డ్ వెజిటబుల్ సాండ్‌విచ్.. ఇలా కోరినన్ని రుచులు. బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారులకు పోషకాహారాన్ని అందించే బాధ్యత కూడా తీసుకుంది. వ్యవస్థాపకుడు అంకిత్ నగోరీ ఓ సీరియల్ ఆంత్రప్రెన్యూర్. ఆరోగ్యకరమైన పిజ్జాలనూ అందించే ప్రయత్నం చేస్తున్నాడు.

## హెల్దిఫై మీ

పదేండ్ల క్రితం తుషార్ వశిష్ఠ తన మిత్రులతో కలిసి స్థాపించాడు. అంతకుముందు తను ఆధార్ సంస్థలో పనిచేశాడు. ఊబకాయం బాగా ఇబ్బంది పెట్టేది. దాన్ని వదిలించుకునే ప్రయత్నంలో చాలా పరిశోధనలే చేశాడు. అప్పుడు వచ్చిన ఆలోచనే హెల్దిఫై మీ. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో అందరికంటే ముందుంటుందీ సంస్థ. 'రియా' పేరుతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను పరిచయం చేసింది హెల్దిఫై మీ. కౌలాలంపూర్, సింగపూర్‌లోనూ శాఖలు ఉన్నాయి. మూడువందల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

తుంది. సాధారణంగా ఆహార తయారీ వ్యాపారంలో లాభం రెండు రెట్లు ఉంటుంది. ఇక్కడ మార్జిన్ అందుకు రెట్టింపు. కార్పొరేట్ దిగ్గజాల కన్ను పడలేదు కాబట్టి, ప్రస్తుతానికి స్టార్టప్స్‌దే రాజ్యం. ఏదో ఒకరోజు పెద్ద చేపవచ్చి చిన్నచేపల్ని మింగేసినా మింగేయవచ్చు. అందుకు ఇంకొంత సమయం ఉంది. ఆలోపే.. స్థిరపడిపోతే సురక్షితంగా ఉంటారు. చాలా అంకుర సంస్థలు ఆ ప్రయత్నంలోనే ఉన్నాయి. కాకపోతే, సగానికి సగం మంది మధ్యలోనే ఆహార దీక్షను విరమిస్తున్నారు. కస్టమర్లను నిలబెట్టుకోవడం ఈ రంగంలో ఓ తీవ్ర సమస్య. ఆ సంక్షోభాన్ని అధిగమించడానికి మోటివేటర్లను నియమించుకుంటున్నారు. నిత్యం సబ్‌స్క్రైబర్లతో టచ్‌లో ఉండటం, లక్ష్యం వైపుగా నడిపించడం వీళ్ల పని. ఒకరికి ఆరోగ్యం. ఒకరికి వ్యాపారం.. ఇద్దరికీ ఉపయోగమే. కాబట్టే, 'మీల్ సబ్‌స్క్రిప్షన్ సర్వీసెస్' రివ్వున దూసుకుపోతున్నాయి. ఇప్పుడిది పదిన్నర వేల కోట్ల రూపాయల మార్కెట్. ఏటా పది నుంచి పదిహేను శాతం పెరుగుదల ఖాయం. ■